క్లుప్తంగా

బస్ పాసుల పంపిణీ


బస్ పాసులు పంపిణీ చేస్తున్న అధికారులు

పెగడపల్లి: విద్యార్థులు ఉచిత బస్ పాసులను సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల ఆర్టీసీ డిపో అధికారులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో గురువారం ఆర్టీసీ ఆధ్వర్యంలో ఉచిత ఆర్టీసీ బస్‌పాస్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బస్ పాస్‌లను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ రవి, ఆర్టీసీ సిబ్బంది ముప్పిడి లక్ష్మారెడ్డి, తూముల మధుకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు..

మల్లాపూర్ : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు గురువారం అంబేద్కర్ యూత్ సభ్యులు ఉచిత బస్‌పాస్‌లు అందజేశారు. విద్యాభివృద్ధికి దోహదపడాలన్న ఉద్దేశంతో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ ఆలిమొద్దీన్, విలేజ్ బస్ అధికారి పాలాస రాజశేఖర్, అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు బండారి రమేశ్, పాల్గొన్నారు.

నిధులు మంజూరు

కథలాపూర్: మండలంలోని దుంపేటలో యాదవ సంఘం భవనానికి జెడ్పీ కోటాలో రూ.2లక్షల నిధులు మంజూరైనట్లు నాయకులు గురువారం పేర్కొన్నారు. నిధులు మంజూరుకు కృషిచేసిన ప్రజాప్రతినిధులకు సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగం భూమయ్య, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీక్, ఏఎంసీ డైరెక్టర్ జెల్ల వేణుగోపాల్, దండిక లింగం, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కథలాపూర్: మండలకేంద్రంలోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ జమీల్ పాషా తెలిపారు. కథలాపూర్, బొమ్మెన, భూషణరావుపేట, చింతకుంట, అంబారిపేట, తాండ్ర్యాల, గంభీర్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

మెట్‌పల్లి: పట్టణంలోని తొమ్మిదో వార్డు పద్మశాలీ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంకు గంగాధర్, ఉపాధ్యక్షుడిగా చిలివేరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మాసపత్రి భూపతి, కోశాధికారిగా పసునూరి ఆనంద్, గౌరవాధ్యక్షుడిగా రమేశ్‌ను ఎన్నుకున్నారు.

వుడ్ కార్పెంటర్స్ అసోసియేషన్..

పట్టణ వుడ్ కార్పెంటర్స్ అసోసియేషన్ కార్యవర్గ అధ్యక్షుడిగా సంభోజి శ్రీధర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం అధ్యక్షుడు పులిమామిడి చంద్రయ్యతో పాటు సంఘం నాయకులు సన్మానించారు.

టీ హబ్ సందర్శనలో డిగ్రీ విద్యార్థులు


విద్యార్థులతో డాక్టర్ సంజయ్

కోరుట్ల: కోరుట్ల నియోజకవర్గంలోని డిగ్రీ విద్యార్థులు గురువారం హైదరాబాద్‌లోని టీ హబ్ సందర్శనకు తరలివెళ్లారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సొంత ఖర్చులతో విద్యార్థులకు టీ హబ్, టీ వర్క్స్, వి హబ్ చూపించి ఐటీ రంగం అభివృద్ధి, పరిశోధనలు, ఇంకుబేటర్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

రాహుల్ దిష్టిబొమ్మ దహనం

జగిత్యాలటౌన్ : భరతమాతతో పాటు భారతీయ మహిళలను కించపరిచే వ్యాఖ్యలు చేసిన రాహుల్‌గాంధీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని భారత సురక్షా సమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు. జగిత్యాల తహసీల్ చౌరస్తాలో రాహుల్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇక్కడ భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు, అక్కినపెల్లి కాశీనాథం, ఎన్నమనేని శ్రీనివాస్‌రావు, తదితరులున్నారు. నాయకులు గణేశ్, బుజ్జిగౌడ్, ప్రణయ్, రంజిత్, రాజరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్కాన్ చేస్తూ.. కంకులు తీసుకెళ్తూ



రాయికల్: పట్టణంలో పైడిమడుగుకు చెందిన ఓ మహిళా రైతు లక్ష్మి గురువారం తన మక్క కంకుల కుప్పపై క్యూ ఆర్ కోడ్ పెట్టి రూ.50కి 7 కంకులు విక్రయించింది. దీంతో పలువురు ఆసక్తిగా కొనుగోలు చేశారు.

అంబులెన్స్ లేక అవస్థలు

- అత్యవసర సమయంలో ప్రైవేట్ వాహనాలే దిక్కు
- ఇబ్బందులు పడుతున్న మారుమూల గ్రామాల ప్రజలు
- ఇతర మండలాల నుంచి వాహనం వచ్చేలోపే గాల్లో కలుస్తున్న ప్రాణాలు


పెగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



108 వాహనం

పెగడపల్లి: అనారోగ్యం బారినపడినా.. ప్రమాదాలు జరిగినా.. ఎవరైనా ఆత్మహత్యకు యత్నించినా అంబులెన్స్‌కు సమాచారం అందిస్తాం. ఆక్సిజన్, వైద్య పరికరాలు, మందులు, ఆస్పత్రికి వెళ్లేసరికి రోగికి ప్రాథమిక చికిత్స అందుతుంది. పెగడపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో 108 వాహనం లేకపోవడంతో రోడ్డు ప్రమాద బాధితులు, క్షతగాత్రులు, కాన్పు సమయంలో మహిళలు, అత్యవసర వైద్యం కోసం ఇక్కట్లు పడుతున్నారు. ప్రమాదాలు జరిగినా ప్రజలు అనారోగ్యం బారినపడితే అత్యవసరంగా ఆస్పత్రికి చేర్చేది 108 వాహనం. మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో ఇతర మండలాల నుంచి 108 వచ్చేసరికి ఆలస్యమవుతోంది. అత్యవసర సమయాల్లో బాధితులు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలం నుంచి ఆస్పత్రులకు వెళ్లేసరికి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలున్నాయి. మండలకేంద్రంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఉండగా నిత్యం వంద మందికి పైగా ఓపీ ఉంటుంది. ఎనిమిది ఉపకేంద్రాలు ఉన్నాయి. 45 వేల జనాభా వరకు ఉంటుంది. మండలంలో ఏ గ్రామంలో ఏ ప్రమాదం జరిగినా బాధితులను ఆస్పత్రులకు తరలించేందుకు అంబులెన్స్ లేకపోవడంతో అత్యవసరంగా కిరాయి కారు, ఆటోవాలాలు రావడం లేదు, రాత్రి వేళల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది.

ఇతర మండలాల నుంచీ..

మండలంలో ఎక్కడైనా ప్రమాదం జరిగితే ఇతర మండలాల నుంచి అంబులెన్స్ రావాల్సిందే. మండలకేంద్రంలో కాకుండా ఇతర మారుమూల ప్రాంతంలో ప్రమాదం జరిగితే 108 వాహనం చేరుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది. అత్యవసర సమయాల్లో 108కు ఫోన్ చేస్తే వేరే మండలాలకు వెళ్లాయని చెబుతున్నారు.

ప్రైవేటు వాహనాలే దిక్కు..

పాముకాటు గురై, పురుగుల మందు తాగిన, రోడ్డు ప్రమాదాలకు గురైన వ్యక్తులను జగిత్యాల, కరీంనగర్ జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రులకు తీసుకెళ్తుంటారు. ఇది మండలకేంద్రం నుంచి సుమారు 30 కిలో మీటర్లు, కరీంనగర్‌కు 40 కిలో మీటర్ల దూరం ఉంటుంది. అక్కడికి వెళ్లాలంటే ప్రైవేటు అంబులెన్స్, లేదా ఇతర వాహనాలపైనే ఆధారపడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

ఏడాది క్రితం మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి ఆత్మహత్యకు యత్నించగా చేయగా అంబులెన్స్ రాక ఆలస్యం కావడంతో జగిత్యాలకు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినా పరిస్థితి విషమించి మృతిచెందాడు. మండలంలోని అయితిపల్లిలో ఆరునెలల క్రితం ఓ గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో అంబులెన్స్ అందుబాటులో లేదు. అదే సమయంలో అటువైపుగా వెళ్తున్న ఎస్సై స్పందించి పోలీస్ వాహనంలో జగిత్యాల ఆస్పత్రికి తరలించారు.

ప్రైవేట్ వాహనాలే దిక్కు



మండలకేంద్రంలోని ఆస్పత్రిలో అంబులెన్స్ అందుబాటులో ఉంచాలి. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. అంబులెన్స్‌కు ఫోన్ చేస్తే గంట సమయం పడుతుంది. ఆలోగా క్షతగాత్రులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఆరోగ్య కేంద్రానికి 108 వాహనం సమకూర్చాలి. – పూసాల శోభ ఎంపీటీసీ లింగాపూర్

అందుబాటులో ఉంచాలి



మారుమూల గ్రామంలో ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు, పాముకాటుకు గురైన వ్యక్తులను, గర్భిణులను జిల్లా కేంద్రానికి తీసుకెళ్లాలంటే అత్యవసర సమయంలో 108 వాహనం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండలకేంద్రంలో అంబులెన్స్ అందుబాటులో ఉంటే రోగులకు త్వరగా చికిత్స అందుతుంది. – బొమ్మెన సుధాకర్ పెగడపల్లి

ప్రతిపాదనలు పంపాం



స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో 108 వాహనం మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఇతర మండలాల నుంచి అంబులెన్స్ రావడం ఆలస్యమవుతున్న మాట నిజమే. మండల ప్రజలకు అంబులెన్స్ అందుబాటులో విధంగా చర్యలు తీసుకుంటాం. – నరేశ్ వైద్యాధికారి, పెగడపల్లి

ఆస్పత్రి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు

రాయికల్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఉన్న 21 గుంటల స్థలాన్ని వెంటనే రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు కోరారు. గురువారం బీఆర్ఎస్ పట్టణ, మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయానికి తరలివెళ్లి తహసీల్దార్ ఖయ్యూంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పుడు డాక్యుమెంట్లతో కొందరు ఆక్రమించారని, ఈ విషయంపై ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, అవి నకిలీ డాక్యుమెంట్లని నిర్ధారించినట్లు తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు సంబంధిత భూమిని తమ ఆధీనంలోకి తీసుకోవాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ఇంతియాజ్, కౌన్సిలర్లు తురగ శ్రీధర్‌రెడ్డి, కన్నక మహేందర్, మహేశ్‌గౌడ్, శ్రీరాముల సువర్ణ, మహేందర్‌బాబు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


తహసీల్దార్ మునీందర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

మల్యాల: మండల తహసీల్దార్‌గా మునీందర్ బాధ్యతలు స్వీకరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నుంచి బదిలీపై వచ్చిన ఆయన బాధ్యతలు స్వీకరించగా కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు.

గొల్లపల్లి తహసీల్దార్‌గా రవికాంత్



గొల్లపల్లి: మండల తహసీల్దార్‌గా రవికాంత్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన తహసీల్దార్ మధుగౌడ్ డెప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందడంతో ఆయన స్థానంలో తహసీల్దార్‌గా రవికాంత్ బాధ్యతలు స్వీకరించారు.

ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌గా ప్రసాద్



ఇబ్రహీంపట్నం : మండల తహసీల్దార్‌గా జి. ప్రసాద్ గురువారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు తహసీల్దార్‌గా పనిచేసిన రవి కిరణ్‌కుమార్ భీమారం మండలానికి బదిలీ చేశారు. ప్రసాద్ నిజామాబాద్ జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ పద్మ, సిబ్బంది తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.

మల్లాపూర్ తహసీల్దార్‌గా వీర్‌సింగ్



మల్లాపూర్ : మల్లాపూర్ తహసీల్దార్‌గా లకావత్ వీర్‌సింగ్ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు తహసీల్దార్‌గా ఉన్న తోట రవీందర్ ములుగు జిల్లాలోని తాడ్వాయి తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. అనంతరం తహసీల్దార్‌ను డిప్యూటీ తహసీల్దార్ శ్రావణి, ఆర్‌ఐలు రాజేశ్, సురేశ్, రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

వెల్గటూర్: మండలంలోని చెగ్యాం గ్రామంలో గురువారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ చేశారు. వెల్గటూర్ లయన్స్ క్లబ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ లయన్ గరినేని భరద్వాజ్ చక్రవర్తి సహకారంతో విద్యార్థులకు ఉచితంగా టై, బెల్టులు పంపిణీ చేశారు. మండల విద్యాధికారి బత్తుల భూమయ్య, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సిరిపురం తిరుపతి, సర్పంచ్ రామిల్ల లావణ్య, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటనర్సయ్య, ఉపాధ్యాయులు, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఫకీర్ కొండాపూర్‌లో..

ఇబ్రహీంపట్నం : మండలంలోని ఫకీర్ కొండాపూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం సర్పంచ్ గుంటి లక్ష్మి విద్యార్థులకు టై బెల్టులు, ఐడెంటిటీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రాధానోపాధ్యాయురాలు రేణుక, విద్యాకమిటీ చైర్మన్ సింగని మారుతి, ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, భరత్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రకు తరలిన ఎంపీటీసీలు

ఇబ్రహీంపట్నం : ఎంపీపీ జాజాల భీమేశ్వరి ఆధ్వర్యంలో ఎంపీటీసీలు గురువారం ప్రత్యేక బస్సులో విహారయాత్రకు బయలుదేరి వెళ్లారు. అన్నవరం, తలుపులమ్మ, తలుపులమ్మ దేవాలయం, సింహాచలం, అరకు, విశాఖపట్నం, విజయవాడ, భద్రాచలంలోని పలు దేవాలయాలను, ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించనున్నట్లు ఈ సందర్భంగా ఎంపీపీ భీమేశ్వరి పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు చిన్నారెడ్డి, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండా ప్రదర్శన

మల్లాపూర్ : హర్‌ఘర్ తిరంగా ఉత్సవాల్లో భాగంగా తపాలాశాఖ కార్యాలయాల్లో జాతీయ జెండాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్లు సబ్ పోస్ట్‌మాస్టర్ ఇట్టెడి రాజేశ్ పేర్కొన్నారు. మండలంలోని చిట్టాపూర్‌లో గాంధీ కూడలి వద్ద ప్రజాప్రతినిధులు, నాయకులు, బ్రాంచి పోస్ట్‌మాస్టర్ దురిశెట్టి రాజేశ్‌తో కలిసి జాతీయ జెండాలను ప్రదర్శించారు. హర్‌ఘర్ తిరంగా ఉత్సవాలకు అవసరమైన జాతీయ జెండాలను రూ.25కే తపాలాశాఖ కార్యాలయాల్లో విక్రయిస్తున్నామన్నారు. ప్యాక్స్ చైర్మన్ నేరెళ్ల మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన


శిబిరానికి హాజరైన ప్రజలు

మల్యాల: మండలంలోని అడ్డరోడ్డులోని కొత్త సురేశ్ పెట్రోల్ బంక్ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. మండలంలోని పలు గ్రామాలకు చెందిన సుమారు 250మంది వైద్యశిబిరంలో పాల్గొన్నారు. 90 మందికి కంటి ఆపరేషన్ అవసరమున్నట్లు గుర్తించారు. గుంటుక ప్రకాశ్, ఉషాకిరణ్, సురేశ్, పోతాని ప్రవీణ్, వి.చంద్రం, కృష్ణమోహన్, కుందారపు మహేందర్, కొత్త సురేశ్, సునీల్, సుధీర్, పబ్బ శ్రీనివాస్, మహేశ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న యువకులు

పెగడపల్లి: మండలంలోని అయితిపల్లికి చెందిన బెజ్జంకి అంజయ్య కూతురు జయశ్రీ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా గ్రామానికి చెందిన శివాజీ యువజన సంఘం సభ్యులు ఆర్థికసాయంగా రూ.10 వేలు అందజేశారు. యువజన సంఘం సభ్యులు రవి, పలుమారు మల్లేశం, జేరిపోతుల శ్రీనివాస్, విలాసాగరం రాజేశం, రాకేశ్‌గౌడ్, కిషన్ గౌడ్, మహేశ్, అంజయ్య, చిన్నబాబు పాల్గొన్నారు.

నీలినాలుక వ్యాధి నివారణ టీకాలు

రాయికల్: యాదవ రైతులు గొర్రెలకు నీలినాలుక వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల అదనపు పశువైద్యాధికారి డాక్టర్ నరేశ్ అన్నారు. గురువారం మండలంలోని సింగరావుపేటలో గొర్రెలకు నీలినాలుక వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ వ్యాధి సోకిన గొర్రెల నాలుక ఉబ్బి నీలి రంగులోకి మారుతుందని, మేత సరిగా మేయకపోవడం లక్షణాలుంటాయన్నారు. రైతులు, తదితరులు పాల్గొన్నారు.

'గల్ఫ్ బాధితులను ఆదుకోవడంలో విఫలం'



కొండగట్టు: గల్ఫ్ బాధితులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని కరీంనగర్ యువజన కాంగ్రెస్ మాజీ పార్లమెంట్ అధ్యక్షులు నాగి శేఖర్ అన్నారు. మండలంలోని పూడూర్‌లో ఆయన మాట్లాడారు. గల్ఫ్ దేశాల్లో సుమారు 15 లక్షల మంది తెలంగాణ కార్మికులు పనిచేస్తున్నారన్నారు. ఉత్తర తెలంగాణ నుంచి 52 ఏళ్లుగా గల్ఫ్ దేశాలకు వలసలు కొనసాగుతున్నా గల్ఫ్ కార్మికుల సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నాయకులు నాగభూషణం, చంద్రమోహన్, ప్రసూన్, వినోద్, మ్యాక అంజయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు అండగా ప్రభుత్వం

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


జగిత్యాల టౌన్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల టౌన్ : ఆశా వర్కర్లకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం గురువారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు దావ సురేశ్, రాం మోహన్‌రావు, ఆనందరావు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

రాయికల్: కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని అల్లీపూర్‌కు చెందిన ముకీద్ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన నలభై మంది కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎంపీటీసీ విజయలక్ష్మి, గ్రామ అధ్యక్షుడు రత్నాకర్‌రావు, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి కృషి

జగిత్యాల: అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. 3, 4 వార్డుల్లో మన ఎమ్మెల్యే మన వార్డు కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ క్యాదాసు నవీన్ పాల్గొన్నారు.

స్థలం మంజూరు చేయాలని వినతి

జిల్లా కేంద్రంలో స్థలం మంజూరు చేయాలని జిల్లా జంగమ సమాజం కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో 80 జంగమ సమాజ కుటుంబ సభ్యులున్నారని, ప్రతినెలా సంఘం సమావేశం జరుపుకునేందుకు భవనం లేక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. భవన స్థలానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అధ్యక్షుడు జగదీశ్వర్, కార్యదర్శి నిరంజన్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల తనిఖీ

పట్టణంలోని గొల్లపల్లి రోడ్‌లో గల ఎస్సీ రెసిడెన్షియల్ ఉమెన్స్ డిగ్రీ కళాశాలను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తనిఖీ చేశారు. మౌలిక వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్య ఉందని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రిన్సిపాల్ శ్రీలత, తదితరులు ఉన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి


ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న ఏఎన్‌ఎంలు


ధర్మపురి : నేరెళ్లలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆశాలు

ఇబ్రహీంపట్నం/కథలాపూర్/మల్లాపూర్/కోరుట్ల: ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించి రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ గురువారం కథలాపూర్, మల్లాపూర్, కోరుట్ల, ఇబ్రహీంపట్నం మండలాల్లో రెండో ఏఎన్‌ఎంలు నిరసన చేపట్టారు. కథలాపూర్ మండలం అంబారిపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎదుట, ధర్మపురి మండలం నేరెళ్ల, మల్లాపూర్ మండలకేంద్రం, ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద నిరసన తెలిపారు. పలుశాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తున్నారని షరతులు లేకుండా తమను క్రమబద్ధీకరించాలని డి మాండ్ చేశారు. ఏఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి'కి దరఖాస్తుల వెల్లువ


ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం : గృహలక్ష్మి పథకానికి మండలం నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. గురువారం ఒక్క రోజే 730 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటివరకు 1202 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ రాం ప్రసాద్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ సాయికుమార్, టైపిస్ట్ నాగరాణి, తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి : మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన వారితో సందడిగా మారాయి. ధర్మపురితో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన 2వేల మంది దరఖాస్తులు చేసుకున్నారు. పట్టణం నుంచి 350 మున్సిపల్ కార్యాలయంలో, పలు గ్రామాలకు చెందిన 1,650 మంది మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకున్నారు.

కోరుట్లలో 935 దరఖాస్తులు..

కోరుట్ల రూరల్: గృహలక్ష్మి పథకానికి గురువారం 935 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని 15 గ్రామాల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు.

పెగడపల్లిలో..

పెగడపల్లి: గృహలక్ష్మి పథకానికి మండలవ్యాప్తంగా 1,054 దరఖాస్తులు వచ్చినట్లు మండల పరిషత్ సూపరింటెండెంట్ చక్రధర్, జూనియర్ అసిస్టెంట్ మనోహర్ తెలిపారు. వివరాలు ఎప్పటికప్పుడు కంప్యూటీకరణ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మల్యాలలో..

మల్యాల: మండల పరిషత్ కార్యాలయంలో గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తులను స్వీకరించారు. 1246 మంది దరఖాస్తు చేసుకున్నారు.

రాయికల్: రాయికల్ మున్సిపాలిటీతో పాటు, మండలంలోని 32 గ్రామాల్లో గృహలక్ష్మి పథకానికి 3075 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్ తెలిపారు. మండలంలో 2500, రాయికల్ మున్సిపాలిటీలో 575 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు.

మల్లాపూర్ మండలంలో...

మల్లాపూర్ : మండల కేంద్రంతో పాటు అన్నిగ్రామాల నుంచి 1570 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో జగదీశ్ తెలిపారు. గృహలక్ష్మి పథకానికి ఈనెల 5 నుంచి 10 వరకు దరఖాస్తులు స్వీకరించమన్నారు. శనివారం 2, ఆదివారం 4, సోమవారం 98, మంగళవారం 177, బుధవారం 392, గురువారం 897తో మొత్తం 1570 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారన్నారు.

'ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి'

మల్లాపూర్ : నిరుపేద ఆర్యవైశ్యుల కోసం రూ.2వేల కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు శివ రాంకిషన్ గుప్తా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టి డిప్యూటీ తహసీల్దార్ శ్రావణికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాలున్నాయన్నారు. సీఎం కేసీఆర్, ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.2వేల కోట్లను కేటాయించాలని, వైశ్యబంధు ప్రకటించాలన్నారు. ఇక్కడ ఆర్యవైశ్య సంఘం మండల ప్రధాన కార్యదర్శి గుండ నరేందర్‌గుప్తా, కోశాధికారి సంగెం శ్రీనివాస్ గుప్తా, సభ్యులు ర్యాగల్ల వెంకటేశ్వర్, పల్లికొండ శ్రీనివాస్, సురేందర్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రాజ్‌కుమార్, శివసాయి, శ్రీనివాస్, శ్రీనివాస్, నాగభూషణం, తిరుపతి, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

పొదుపు ఖాతాలు అందజేత



కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు పొదుపు ఖాతాలను అందజేశారు. విద్యార్థులు డబ్బులు పొదుపు చేసుకునేందుకు, ఉపకార వేతనాలు జమచేసేందుకు వీలుగా ఖాతాలు అందించామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ రాజు, హెచ్ఎం స్వామి, ఉపాధ్యాయులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.